క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీఓ



సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు పూలమొక్క అందిస్తున్న ఎంపీడీఓ చందన, సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.సహదిత్ వెంకట త్రివినాగ్‌ను మార్కాపురం ఎంపీడీఓ తోట చందన బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క బహూకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓతోపాటు సిబ్బందికి సూచించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

కొనకనమిట్ల: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఎస్సై కె.మాధవరావు ఆకాంక్షించారు. బుధవారం వెలుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

పొదిలి: పట్టణంలోని బెల్లంకొండ నగర్‌లో భారతీయ జనతా పార్టీ పట్టణ, రూరల్ కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలని సూచించారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024కు మిస్డ్ కాల్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాగులూరి రామయ్య, డి.రమణారెడ్డి, పి.నారాయణ, సాలేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం



పట్టణంలోని ఒంగోలు-కర్నూలు రహదారి



ఉప్పలపాడు బస్టాండ్ వద్ద ప్రధాన రోడ్డు ఇలా..



నిర్మల కాన్వెంట్ రోడ్డు



జూనియర్ సివిల్ కోర్టు రోడ్డు కూడా..



ఏలూరు రోడ్డు దుస్థితి

పొదిలి: వర్షం వస్తే ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. మండల కేంద్రం ప్రధాన రోడ్డు నుంచి పల్లె రోడ్లు, అంతర్గత రోడ్లు కూడా ఇలాగే మారాయి. ముఖ్యంగా గుంతల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో కాలం ఎలా వెళ్లదీయాలని, అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒంగోలు-నంద్యాల ప్రధాన రహదారి.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, పెద్ద మసీదు, అడ్డ రోడ్డు వద్ద నీటి కుంటలా మారింది. ఉప్పలపాడు బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండటమే కాకుండా రోడ్లపై గుంతలు పడ్డాయి. ఏలూరు గ్రామానికి వెళ్ళే రోడ్డంతా గుంతలమయంగా మారింది. పట్టణంలోని నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కోర్టు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై కూడా గొయ్యిలు ఏర్పడి నీరు నిల్వ ఉంటోంది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

గుంత తీశారు.. మరమ్మతులు మరచారు



పగిలిన పైపులైన్ నుంచి వృథాగాపోతున్న నీరు

బేస్తవారిపేట: స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక మెయిన్‌రోడ్డు పక్కన మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం పంచాయతీ సిబ్బంది వారం క్రితం గుంత తీశారు. కానీ మరమ్మతులు చేపట్టకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. నీరు రోడ్డు మీదకు చేరకుండా చుట్టూ కట్టవేసి డ్రైనేజీ కాలువలోకి మళ్లించారు. అయితే మురుగు నీరు మంచినీటి పైపుల్లోకి చేరుతుండటంతో రెడ్డినగర్ వాసులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో రోడ్డు మార్జిన్ దిగేందుకు అవకాశం లేకపోవడంతో వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వరద బాధితుల కోసం కదిలిన యువత

● 5 వేల చొప్పున పులిహోర ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లతో బెజవాడకు..



ఆహారం, నీళ్ల బాటిళ్లతో విజయవాడకు వెళ్తున్న ఫ్రెండ్స్ యూత్

కొనకనమిట్ల: వరద నీటి తాకిడితో విలవిల్లాడుతున్న విజయవాడ వాసులకు తమ వంతు సాయం అందించేందుకు కొనకనమిట్ల మండలం రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం గ్రామానికి చెందిన పలువురు యువకులు ముందుకొచ్చారు. ఫ్రెండ్స్ యూత్ సభ్యులంతా నగదు పోగు చేసుకుని గ్రామంలోనే 5 వేల ప్యాకెట్ల పులిహోర, 5 వేల వాటర్ బాటిళ్లు సమకూర్చారు. బుధవారం ఆటో తీసుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



మాట్లాడుతున్న సిడిపిఓ సుధమారుతి

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఓబులక్కపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ సుధమారుతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కేంద్రాల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సర్టిఫికెట్లపంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలనలో కేంద్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం



సబ్‌కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోజురోజుకూ నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోతున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం మార్కాపురంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ.. అందుకు భిన్నంగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మోదీ సంస్కరణల ఫలితంగా చిన్న పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. లాభాలు అందిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం విడనాడాలని హితవు పలికారు. అనంతరం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, చిత్తారి పెద్దన్న, దుప్పట్ల కాశయ్య, డి.గోపి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

రాచర్ల: రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సత్యవోలు గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. వివరాలు.. సత్యవోలు గ్రామానికి చెందిన యడవల్లి పోలయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రైలు పట్టాలపై పోలయ్య మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు



సుధాకర్, తర్లుపాడు



రాహేలమ్మ, మీర్జపేట

తర్లుపాడు: తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ముత్తోజు సుధాకర్ జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ఒంగోలులో నిర్వహించే కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మండలంలోని మీర్జపేట ఎంపీపీ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న పి.రాహేలమ్మ ఎంపికయ్యారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని పలు పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2024–25 సంవత్సరానికిగాను ఉత్తమ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వీరికి గురువారం గురుపూజోత్సవం సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతులమీదుగా అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. మండలంలోని ఓబులక్కపల్లి, బట్టువారిపల్లె ఎంపీయూపీ స్కూల్ టీచర్లు కె.సుగుణ, ఎస్‌కే మస్తాన్‌వలి, గురుగుపాడు ప్రాథమిక పాఠశాల టీచర్ ఎస్.లక్ష్మీప్రసన్న, కాశీపురం ప్రాథమిక పాఠశాల టీచర్ సీహెచ్ శిరీష, తుమ్మగుంట ఎంపీపీఎస్‌కు చెందిన ఎస్.కేశవరావు, ఉప్పలపాడు పాఠశాల టీచర్ జి.లక్ష్మీకుమారి, ఆముదాలపల్లి పాఠశాలకు చెందిన ఎ.మాధవి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ వెల్లడించారు.

కొనకనమిట్ల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఉత్తమ అవార్డులు వరించాయి. సిద్ధవరం ఏఏ పాఠశాల నుంచి కందుల సుజాత, చౌటపల్లి పాఠశాలకు చెందిన పి.శైలజ, చినారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టి.రామారావు, టి.రత్నబాబు, నాగంపల్లి యూపీ పాఠశాల నుంచి పద్మ గాయత్రి ఎంపికయ్యారు. వీరిని సహచర ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు బుధవారం అభినందించారు.

కొమరోలు: మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి, తెలుగు ఉపాధ్యాయురాలు సుజాత ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని బుధవారం మండల విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, మండలంలో పనిచేస్తున్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు దక్కాయని ఎంఈఓ రాందాస్ నాయక్ బుధవారం తెలిపారు. ఎం.రాజయ్య(ఎంపీపీఎస్ ఏఏ రాయవరం), కేఎండీడీ జ్యోతి(ఏబీఎం హైస్కూల్), ఎన్.రాజయ్య(ఎంపీపీఎస్ హెచ్‌ఎం తిప్పాయపాలెం), జె.మరియమ్మ (ఏబీఎం హైస్కూల్), కె.నాగలక్ష్మి(శారద ఎయిడెడ్ స్కూల్)కి అవార్డులు దక్కాయని వెల్లడించారు.

130 మద్యం సీసాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్సై అనిత

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని కాకర్ల సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిత తెలిపారు. గన్నెపల్లెకు చెందిన ఒకరు 130 క్వార్టర్ బాటిళ్ల మద్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూలిన మట్టి మిద్దె



కొమరోలు: ఇటీవల మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు నానిన మట్టి మిద్దె ఒక్కసారిగా కూలిపోయింది. ఈ సంఘటన మండలంలోని భావాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలిరెడ్డి మట్టి మిద్దెలో నివాసం ఉంటున్నాడు. ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పట్టణ ఎస్సై సైదుబాబు

మార్కాపురం టౌన్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై సైదుబాబు హెచ్చరించారు. బుధవారం శ్రీసాధనా జూనియర్ కళాశాలలో విద్యార్థుతో ఆయన మాట్లాడారు. చదువుపై దృష్టిపెట్టాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనాల డ్రైవర్లు కూడా విద్యార్థులను తీసుకొచ్చేప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మితిమీరిన వేగంతో బస్సులు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కేపీ కొండారెడ్డికి నంద్యాల మాజీ ఎంపీ పరామర్శ



కేపీ కొండారెడ్డితో మాట్లాడుతున్న పోచం బ్రహ్మానందరెడ్డి, పక్కన నాగార్జునరెడ్డి

మార్కాపురం: మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డిని నంద్యాల మాజీ ఎంపీ పోచం బ్రహ్మానందరెడ్డి బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితోనూ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు



పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన క్రీడల పోటీలను ఎంఈఓలు రాందాస్‌నాయక్, శ్రీనివాసులు ప్రారంభించారు. 100, 200 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల వాకింగ్, క్యారమ్స్, వాలీబాల్, క్రికెట్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మహిళలకు 100, 200 మీటర్ల రన్నింగ్ 400 మీటర్ల వాకింగ్, టెన్నికాయిట్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని సంఘ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీరాములు, వెంకటరెడ్డి, ప్రభాకర్, అల్లూరెడ్డి, వెంకటేశ్వర్లు, రమాదేవీ, రాజేష్, రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములపై వివాదం

● దేవదాయ శాఖకు సంబంధం లేదని స్పష్టం చేసిన కమిటీ

● అధికారులు, కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం

మార్కాపురం: మండలంలోని అమ్మవారిపల్లె గ్రామం వద్ద సద్గురు యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ భూముల విషయమై బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్వామి వారి భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు బుధవారం తన సిబ్బందితో కలిసి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, బొగ్గరపు శేషయ్య మరికొందరు గ్రామస్తులు కలిసి దేవదాయశాఖ అధికారులతో మాట్లాడారు. 1958లోనే సద్గురు యోగానంద లక్ష్మీ నరసింహాస్వామి వారి ఆలయ భూములపై అన్ని రకాల అగ్రిమెంట్లు ఉన్నాయని, ఈ భూములకు దేవదాయ శాఖకు ఎటువంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. స్వామి వారి పేరుతో సేవా సంఘం ఏర్పాటు చేసి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తాము భూములు ఆక్రమించలేదని స్పష్టం చేశారు. కాగా అధికారులు, కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం పోలీసుల వరకు వెళ్లింది.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న నరేష్

మార్కాపురం రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రోగ్రాం కన్వీనర్ కవలకుంట్ల నరేష్ సూచించారు. మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలు, గంజాయి, బెట్టింగ్, టాటో, అనైతిక శృంగారానికి దూరంగా ఉండాలని చెప్పారు. నైపుణ్యం పెంపొందించుకోవడం, విద్యపై శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.